ప్రజాశక్తి

శుక్రవారం 12 డిసెంబర్ 2025

5

శ్రీ సత్యసాయి

ధర్మవరంలో స్క్రబ్ టైఫస్ కేసు

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

ధర్మవరం పట్టణంలో స్క్రబ్ టైఫస్ కేసు నమోదు అయ్యింది. పట్టణంలో శాంతి నగర్‌కు చెందిన చౌడమ్మ (79)కి స్క్రబ్ టైఫస్ వ్యాధి సోకిందని ప్రభుత్వాసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ తిప్పేంద్ర నాయక్ తెలిపారు. చౌడమ్మ ఈనెల 4వ తేదీన జ్వరం, వాంతులు, కాళ్ల నొప్పులతో ప్రభుత్వాసుపత్రిలో చికిత్స నిమిత్తం చేరిందన్నారు. జ్వరం తగ్గకపోవడంతో అనుమానంతో ఈ నెల 8వ తేదీ రాపిడ్ టెస్ట్ చేయగా స్క్రబ్ టైఫస్ అనుమానిత లక్షణాలు వచ్చాయన్నారు. తదుపరి పరీక్షల నిమిత్తం అనంతపురం మెడికల్ కళాశాలకు పంపగా 10న స్క్రబ్ టైఫస్ అని నిర్ధారణ అయ్యిందన్నారు. ప్రస్తుతం ఆమెకు ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య చికిత్సలు అందిస్తున్నామని తెలిపారు. ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందన్నారు. ఐదు రోజుల కంటే ఎక్కువగా జ్వరం రావడం, శరీరంపై నల్ల మచ్చ, తలనొప్పి, ఒళు నొప్పులు, శ్వాసలో ఇబ్బంది లాంటి లక్షణాలు ఉంటే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య చికిత్సలు చేయించుకోవాలని తెలిపారు.

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

జిల్లా నివేదికలు తయారు చేయండి

కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ఈ నెల 17, 18న రెండు రోజుల పాటు అమరావతిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, అధ్యక్షతన జరిగే జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్స్‌కు అన్ని శాఖలు పక్కా నివేదికలు రూపొందించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఏపీ సచివాలయం సిఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి గురువారం సాయంత్రం కలెక్టర్ల కాన్ఫరెన్స్ సంసిద్ధత తదితర విషయాలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశం అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. ఆయా శాఖల లక్ష్యాలు, సాధించిన ప్రగతి, ప్రత్యేకంగా శాఖల్లో అమలవుతున్న ఉత్తమ ప్రాక్టీసెస్‌పై ఈ నెల 13వ తేదీలోగా నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలపై ప్రజా సానుకూల అవగాహనను పెంచాలన్నారు.

సమర్ధవంతంగా పని చేయండి

జిల్లాలో అమలవుతున్న పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు లబ్ధి చేకూరేలా అధికారులు సమర్ధవంతంగా పని చేయాలని కలెక్టర్ సూచించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో వ్యవసాయం, ప్రకతి వ్యవసాయం, పట్టు పరిశ్రమ డ్వామా, డీఆర్డీఏ, అటవీ, జిల్లా లీడ్ బ్యాంక్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రజలకు నేరుగా చేరే పథకాల విషయంలో ఏ శాఖలోనైనా ఆలస్యం, నిర్లక్ష్యం చోటు చేసుకోకూడదని స్పష్టం చేశారు. ప్రతి శాఖ నెలవారీగా లక్ష్యాలు, సాధించిన ప్రగతి, భవిష్యత్ కార్యాచరణపై స్పష్టమైన నివేదికలు సమర్పించాలన్నారు.

'దుర్గం' పీఠం టిడిపి కైవసం

◆ ఛైర్‌పర్సన్‌గా తలారి గౌతమి ఎన్నిక

◆ 11 ఓట్లకే వైసిపి పరిమితం

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

కళ్యాణదుర్గం మున్సిపల్ ఛైర్మన్ స్థానాన్ని టీడీపీ కైవసం చేసుకుంది. వారం రోజులుగా చోటు చేసుకున్న రాజకీయాల పరిణామాల అనంతరం ఎన్నికలో టీడీపీ తన బలాన్ని చాటుకుంది. కేవలం 11 మంది కౌన్సిలర్ల బలంతో వైసీపీ ఆగిపోయింది. ఇద్దరు వైసీపీకి చెందిన కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. 11 మంది కౌన్సిలర్లు, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఎక్స్‌ఆఫిషియో ఓట్లతో టీడీపీ మద్దతుతో ఛైర్మన్‌గా బరిలోదిగిన తలారి గౌతమి 13 ఓట్లతో ఛైర్‌పర్సన్‌గా గెలుపొందింది.

ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి వసంతబాబు ఆధ్వర్యంలో గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఛైర్మన్ ఎన్నిక కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ మద్దతులో ఛైర్మన్‌గా 15వ కౌన్సిలర్ తలారి గౌతమి పోటీలో నిలవగా 21వ వార్డు కౌన్సిలర్ జయం ఫణింద్ర ప్రతిపాదించారు. 24వ కౌన్సిలర్ పూజారి తిమ్మప్ప బలపరిచారు. గౌతమికి మద్దతుగా కౌన్సిలర్లు అనసూయమ్మ, అభిరాం, వెంకటేశులు, నూర్జహాన్, అచ్చుపల్లి అనిత, బాలరాజేశ్వరమ్మ, మహాలక్ష్మి, రాధికరాణి, జయంఫణి, పూజారి తిమ్మప్పలు ఓటేశారు. ఎక్స్ ఆఫిషియో సభ్యులుగా ఉన్న ఎంపి, ఎమ్మెల్యేలు మద్దతు తెలపడంతో గౌతమికి 13 ఓట్లు వచ్చాయి. వైసీపీ నుంచి ఛైర్మన్ అభ్యర్థిగా లక్ష్మన్న బరిలో నిలిచారు. ఈయనకు మద్దతుగా కుర్రరాము, హేమావతి, సుదీప్తి, రాజ్‌కుమార్, ఎరుకుల తిప్పమ్మ, తిరుమల చంద్రమ్మ, గంగమ్మ, లక్ష్మన్న, అర్చన, పూసల భాగ్యమ్మ, పరమేశ్వరప్పలు మద్దతు తెలిపారు. 11 మంది సభ్యులు మాత్రమే మద్దతు తెలిపారు. 13 ఓట్లతో ఛైర్మన్ స్థానాన్ని టిడిపి కైవసం చేసుకుంది.

కీలకంగా ఎంపీ, ఎమ్మెల్యే ఓట్లు

ఛైర్మన్ ఎన్నికలో ఎక్స్ అఫిషియో సభ్యులుగా ఓటేసిన ఎంపి, ఎమ్మెల్యేల ఓట్లు కీలకం అయ్యాయి. ఛైర్మన్ ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న అధికార టిడిపి గతంలో టీడీపీలో చేరిన వైసీపీ సభ్యులతో పాటు వైస్ ఛైర్మన్‌గా ఉన్న జయం ఫణిని టీడీపీలో చేర్చుకున్నారు. గతంలో టీడీపీలో చేరిన వైసీపీ కౌన్సిలర్ గంగమ్మ ఇటీవల వైసీపీ గూటికి చేరింది. బలం తక్కువగా ఉందని భావించిన టీడీపీ వైసీపీలోని ఇద్దరు కౌన్సిలర్లను ఓటింగ్‌కు హాజరుకాకుండా వ్యూహం రచించింది. అయినప్పటికి రెండు పార్టీలకు 11 సభ్యుల ప్రకారం సమానంగా కౌన్సిలర్ల బలం ఉంది. ఈ సమయంలో ఎంపీ, ఎమ్మెల్యే ఓట్లతో టీడీపీ ఛైర్మన్ స్థానాన్ని కైవసం చేసుకుంది. మున్సిపల్ ఛైర్మన్ స్థానాన్ని దక్కించుకున్న టీడీపీ పట్టణంలో భారీ విజయోత్సవ ర్యాలీ నిర్వహించింది. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, ఎంపీ అంబికాలక్ష్మీనారాయణ, కొత్తగా ఎంపికైన ఛైర్‌పర్సన్ తలారి గౌతమి, కౌన్సిలర్లు, ముఖ్యనాయకులు, కార్యకర్తలు మున్సిపల్ కార్యాలయం నుంచి పట్టణ పురవీధులలో ర్యాలీచేశారు.

ఛైర్‌పర్సన్ తలారి గౌతమి

మున్సిపాలిటీ అభివృద్ధికి సూచిక ఎమ్మెల్యే, ఎంపీలు

ఛైర్‌పర్సన్‌గా టీడీపీకి చెందిన తలారి గౌతమి గెలుపొందడం మున్సిపాల్టీ అభివృద్ధికి సూచిక అంటూ ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబులు తెలియజేశారు. ఎన్నిక అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, విద్యాశాఖమంత్రి నారాలోకేష్ సారథ్యంలో జరుగుతున్న అభివృద్ధికి కౌన్సిలర్లు మద్దతు తెలపడం హర్షనీయమన్నారు. వైసీపీ నాయకులు పదేపదే కులరాజకీయాలు మాట్లాడుతూ పబ్బం గడుపుకుంటున్నారని మండిపడ్డారు. ఛైర్మన్ గెలుపునకు సహకరించిన అందరికి రుణపడి ఉంటామని హామీ ఇచ్చారు.

ఛైర్మన్ ఎన్నిక అనంతరం పట్టణంలో ర్యాలీ చేస్తున్న టిడిపి, కూటమి శ్రేణులు

చంద్రబాబు నాయుడుతో బల్లా పల్లవి

అనంతపురం మార్కెట్ యార్డ్ ఛైర్మన్‌గా

బల్లా పల్లవి

ప్రజాశక్తి-అనంతపురం

బల్లా పల్లవి

అనంతపురం మార్కెట్ యార్డ్ ఛైర్మన్‌గా బల్లా పల్లవిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సుదీర్ఘకాలంగా ఆమె భర్త బల్లా సురేష్ బల్లా పల్లవి టిడిపిలో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. కార్పొరేటర్‌గా సేవలను అందించి డివిజన్‌లో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. టిడిపి క్రియాశీలక కార్యక్రమాల్లో క్షేత్రస్థాయిలో పనిచేసే గుర్తింపు పొందారు. ఈ నేపథ్యంలో బల్లా పల్లవిని గుర్తించిన అధినాయకత్వం ఆమెకు మార్కెట్ యార్డ్ ఛైర్మన్ పదవిని ఇచ్చారు.

రుణపడి ఉంటా : బల్లా పల్లవి

తనకు మార్కెట్‌యార్డు ఛైర్మన్‌గా అవకాశం కల్పించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యా, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్, అనంతపురం శాసనసభ్యులు దగ్గుపాటి ప్రసాద్‌కు రుణపడి ఉంటామని బల్లా పల్లవి తెలిపారు. మార్కెట్‌యార్డు, టిడిపి అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలియజేశారు.

నారా లోకేష్‌తో బల్లా దంపతులు

15 నుంచి భూ క్రమబద్ధీకరణ గ్రామసభలు

ప్రజాశక్తి-అమరాపురం

తహశీల్దార్ లక్ష్మీనరసింహ

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ గ్రామాల్లో చిన్న, సన్న కారు రైతులకు 2024 జూన్ 15వ తేదీ వరకూ రిజిస్టర్ కానీ భూముల అగ్రిమెంట్ మీద కానీ, సాదా బైనామా మీద కొనుగోలు చేసిన డాక్యుమెంట్లను క్రమబద్ధీకరణ చేసేందుకు ఈ నెల 15 నుంచి 23వ తేదీ వరకు గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తహశీల్దార్ లక్ష్మీనరసింహ తెలిపారు. 15వ తేదీ అమరాపురం తహశీల్దార్ కార్యాలయంలో, 16న హేమావతి, 17న ఆలుకూరు, 18న తమ్మడేపల్లి, 19న కె.శివరం, 20న వలస, 22న నిద్రఘట్ట, 23న బసవన్నపల్లి గ్రామ సచివాలయాల్లో గ్రామ రెవెన్యూ అధికారుల ద్వారా గ్రామసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. చిన్న రైతులు 2.25 ఎకరాల తరి, 2.50 మెట్ట భూమి కలిగిన రైతులు వారి భూమిలో సాగు చేసుకుంటూ రిజిస్టర్ కానీ అగ్రిమెంట్ పత్రాలపై ఆ తేదీ లోపు కొనుగోలు చేసి ఉండాలన్నారు. రైతులు డాక్యుమెంట్లను క్రమబద్ధీకరణ చేసుకునేందుకు ఫారం ఎక్స్ దరఖాస్తులను మీ సేవా ద్వారా కానీ, గ్రామ సచివాలయం ద్వారా కానీ దాఖలు చేసుకోవడానికి 2027 డిసెంబర్ 31వ తేదీ వరకు అవకాశం ఇచ్చినట్లు తెలిపారు. ఈ ఉత్తర్వులు గ్రామీణ ప్రాంతంలో పట్టా భూమి కలిగిన రైతులకు మాత్రమే వర్తిస్తాయని, ప్రభుత్వ, అసైన్మెంట్ భూములకు ఈ ఉత్తర్వులు వర్తించవని స్పష్టం చేశారు. మండలంలోని సన్న, చిన్నకారు రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

సిఐటియు జాతీయ మహాసభలకు నిధుల సేకరణ

ప్రజాశక్తి-లేపాక్షి

విరాళాలు సేకరిస్తున్న సిఐటియు నాయకులు

విశాఖపట్నంలో ఈ నెల 31 నుంచి జనవరి 4వ తేదీ వరకూ సిఐటియు జాతీయ మహాసభలు నిర్వహించనున్నారు. ఈ క్రమంలో సంఘీభావ నిధి సేకరణలో భాగంగా గురువారం లేపాక్షిలో సిఐ టియు నాయకులు దుకాణాలు, బ్యాంకులు, ప్రభుత్వ కార్యాలయాలు తిరిగి విరాళాలు సేకరించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు జడ్‌పి.శ్రీనివాసులు, ఫిరంగి ప్రవీణ్‌కుమార్, కృష్ణమూర్తి, అంగన్వాడీ కార్యకర్తలు ధనమ్మ, భాగ్యమ్మ, శశికళ, ఆశా కార్యకర్తలు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

ప్రజాశక్తి-హిందూపురం

సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ డాక్టర్ ప్రగతి

మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదిగి ఆర్థిక అభివృద్ధి సాధించా లని వక్తలు పేర్కొన్నారు. హిందూపురం ఎన్ఎస్‌పిఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం హైదరాబాదుకు చెందిన మహిళా సాధికారత సోషల్ ఇంపాక్ట్, వ్యవస్థాపకత బృందంతో కలిసి 'యువ వేదిక-బూట్‌క్యాంప్' పేరుతో వ్యవస్థాపకతపై అవగాహన కార్యక్రమం జరిగింది. విద్యార్థులకు నైపుణ్య అభివృద్ధి, వ్యవస్థాపకతను కెరీర్‌గా ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఈ అవగాహన నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. ప్రగతి తమ కళాశాలకు వచ్చి విద్యార్థినులకు ఎంట్రప్రెన్యూర్షిప్ గురించి అవగాహన కల్పించినందుకు ఉయ్ హబ్ బందానికి కృతజ్ఞతలు తెలిపారు. మహిళా సాధికారత హబ్ సోషల్ ఇంపాక్ట్, వ్యవస్థాపకత డైరెక్టర్ జాహిద్ అక్తర్ షేక్ తమ సంస్థ లక్ష్యాలను, కార్యక్రమాలను పరిచయం చేశారు. ప్రోగ్రాం మేనేజర్ తాజ్దార్ అలీ మహిళా సాధికారత హబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాలు, కార్యక్రమాలు, మహిళా పారిశ్రామికవేత్తలకు అందజేస్తున్న శిక్షణ, ప్రోత్సాహం తదితర అంశాల గురించి వివరించారు. ప్రాజెక్ట్ అసోసియేట్ సౌమ్య విద్యార్థినులతో ఐడియేషన్ ప్రక్రియ ద్వారా పాత న్యూస్ పేపర్లతో క్రాఫ్ట్ ఎలా చేయాలో అభ్యసనం చేయించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సుమంగళి, పార్వతి, భోజప్ప, కళావతి, నందిని, అఫ్సానా, అనూష తదితరులు పాల్గొన్నారు.

మడకశిరకు సోలార్ ప్లాంట్ మంజూరు

ప్రజాశక్తి-మడకశిర టౌన్/గుడిబండ

మడకశిర ప్రాంతంలో రూ. 8,500 కోట్ల పెట్టుబడితో చింత గ్రీన్ ఎనర్జీ కంపెనీ 2,125 మెగా వాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ ఏర్పాటు చేయనున్నట్లు గురువారం సమాచార శాఖ మంత్రి పార్థసారథి అమరావతిలో ప్రకటించారు. ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ప్రత్యేక చొరవ వల్లే మడకశిర నియోజకవర్గానికి అతిపెద్ద సోలార్ ప్రాజెక్టు మంజూరైంది. ఈ కంపెనీ ద్వారా 5,800 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కనున్నాయి. ఈ కంపెనీ గుడిబండ, మడకశిర ప్రాంతాల్లో సౌర విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ ఏర్పాటు చేయనుంది. ఈ ప్రాంతానికి సౌర విద్యుత్ ప్లాంట్ కేటాయించిన సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిలకు నియోజకవర్గ ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

అయ్యప్పస్వామి గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

అయ్యప్పస్వామి గ్రామోత్సవం

ప్రజాశక్తి - బత్తలపల్లి

మండలంలోని అప్పరాచెరువు గ్రామంలో బుధవారం రాత్రి అయ్యప్ప స్వామి గ్రామోత్సవం కన్నులపండువగా నిర్వహించారు. వెండి రథాన్ని అందంగా అలంకరించి గ్రామోత్సవాన్ని అయ్యప్ప సేవా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. వాహనం ముందు చిన్నారులు జ్యోతులు పట్టుకుని స్వాగతం పలుకుతుండగా అయ్యప్ప మాలధారులు పైడితుల్లి ఆడుతూ ఊరేగింపు కొనసాగింది. ఈ కార్యక్రమంలో అయ్యప్ప సేవా కమిటీ సభ్యులతో పాటు అయ్యప్పమాలదారులు, వందలాది మంది భక్తులు. గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ తరలింపును అడ్డుకోండి

ప్రజాశక్తి-రొద్దం

మండల సమావేశంలో వైసిపి ప్రజాప్రతినిధుల డిమాండ్

మండల సమావేశంలో సమస్యలు లేవనెత్తిన సభ్యులు

కర్నాటకకు ఇసుక అక్రమ తరలింపును అడ్డుకోవాలని వైసిపి ప్రజాప్రతినిధులు డిమాండ్ చేశారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో గురువారం ఎంపిపి అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథులుగా స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ రెడ్డివారి మంజునాథ్, సింగిల్‌విండో అధ్యక్షులు వీరాంజనేయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వైసిపి సర్పంచులు, ఎంపిటిసిలు రొద్దం లో నెలకొన్న పలు సమస్యలను ప్రస్తావించారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక విధానం వల్ల పెన్నానది పరివాహక ప్రాంతంలో బోరు బావులు ఉన్న రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. మండల కేంద్రానికి చుట్టుపక్కల కర్నాటక ప్రాంతం ఉండడంతో రాత్రింబవళ్లు ఇసుకను అక్రమంగా రాష్ట్ర సరిహద్దులు దాటిస్తున్నారన్నారు. రైతుల సంక్షేమం దృష్ట్యా కర్నాటకకు ఇసుక తరలింపును అడ్డుకోవాలని కోరారు. సమావేశానికి కొన్ని శాఖల అధికారులు హాజరు కాకపోవడంతో ఆ శాఖల సమస్యలు తెలియజేయడానికి వీలులేకుండా పోయినట్లు తెలుస్తోంది. ప్రజల అవసరాల కోసం మట్టి తరలిస్తుండగా అడ్డుకుంటున్నారని వాపోయారు. స్పందించిన తహశీల్దార్ ఉదయశంకర్‌రాజ్ మాట్లాడుతూ ఇరిగేషన్ అధికారుల వద్ద అనుమతి తీసుకుని చలానా చెల్లించి మట్టిని తరలించుకోవచ్చు అన్నారు. ఇసుక తరలింపుపై మంజునాథ్ మాట్లాడుతూ రెండు వారాల క్రితమే సోమవారం గ్రీవెన్స్ డేలో రైతులు మంత్రికి తెలిపారన్నారు. ఇసుక తరలింపుపై ఆధారాలతో అధికారులకు తెలియజేస్తే చర్యలు చేపడతారన్నారు. సమావేశంలో ఎంపిడిఒ ఆనంద్ ప్రసాద్, డిప్యూటీ ఎంపిడిఒ గోవిందప్ప, సర్పంచులు ఎంపిటిసిలు, మండల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసం పెంపొందించుకోవాలి

జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ చెన్నారెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

ఎన్ఎస్ఎస్ క్యాంపునకు బయల్దేరిన విద్యార్థులు

విద్యార్థులు విద్యతో పాటు సేవాగుణం, వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలని జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి అన్నారు. గురువారం రాప్తాడు మండలంలోని రామినేపల్లిలో అనంతపురం జెఎన్‌టియు విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల జాతీయ సేవ పథకం యూనిట్-3 ఆధ్వర్యంలో ఏడు రోజుల స్పెషల్ క్యాంపును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ప్రజల సమస్యలను తెలుసుకుని, పరిష్కార మార్గాలను సూచించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెఎన్‌టియు జాతీయ సేవా పథకం కోఆర్డినేటర్ శారద, అధికారిణి మమత, జాతీయ సేవాపథకం వాలంటీర్లు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఎమ్‌డీని కలిసిన జోనల్ ఛైర్మన్

అనంతపురం : ఎపిఎస్ ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమలరావును గురువారం విజయవాడలోని ఆర్టీసీ హౌస్‌లో కడప జోనల్ ఛైర్మన్ పూల నాగరాజు మర్యాద పూర్వకంగా కలిశారు. ఇందులో భాగంగా గుత్తి, రాయదుర్గం బస్‌స్టేషన్‌ల ఆధునీకరణకు నిధులు, రాయదుర్గం డిపో నుంచి వెన్నెల, సూపర్ లగ్జరీ స్పెషల్ సర్వీస్‌ను బెంగళూరు, విజయవాడకు నడపాలని కోరారు.

'అనంత'లో అక్రమ కట్టడాల తొలగింపు

అనంతపురం కార్పొరేషన్ : నగరంలోని నాయక్‌నగర్, ఆర్‌కె నగర్‌లలో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న అనధికార కట్టడాలను గురువారం తొలగించినట్లు కమిషనర్ బాలస్వామి తెలిపారు. టౌన్ ప్లానింగ్ సిబ్బంది క్షేత్రస్థాయి పరిశీలనలో సర్వే నెం.344/2 బి, నాయక్‌నగర్, సర్వేనెం.124, ఆర్‌కె నగర్‌లో భారీ అనధికారిక నిర్మాణాలను గుర్తించి జెసిబితో తొలగించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా కట్టిన కట్టడాలపై తొలగింపు చర్యలు కొనసాగుతాయన్నారు. బిల్డింగ్ ఫీసరైజేషన్ స్కీం ద్వారా ఈ ఏడాది ఆగస్టు 31వ తేదీ వరకూ కట్టిన నిర్మాణాలకు అనుమతులు పొంది, నిబంధనలను అతిక్రమించి కట్టిన అనధికారిక కట్టడాలు, భవననాలను క్రమబద్ధీకరించుకోవాలన్నారు.

13న మండల సమావేశం

ప్రజాశక్తి-గుడిబండ

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలోని సమావేశ హాలులో ఈ నెల 13వ తేదీ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ కేశవరెడ్డి తెలిపారు. ఆ సమావేశానికి జడ్పిటిసి, ఎంపిపి, ఎంపిటిసిలు, సర్పంచులు, కోఆప్షన్ మెంబర్, మండలంలోని వివిధ శాఖ అధికారులు తప్పక హాజరు కావాలని ఆయన సూచించారు.

'పది' మోడల్ పేపర్లు పంపిణీ

ప్రజాశక్తి-రొద్దం

మండలంలోని చోలేమర్రి ఉన్నత పాఠశాలలో గురువారం పదో తరగతి విద్యార్థులకు యుటిఎఫ్ రూపొందించిన మోడల్ పేపర్లను ఉచితంగా పంపిణీ చేశారు. చోలేమర్రి గ్రామానికి చెందిన ఈఎస్ టిఒ(గ్రూప్-1 అధికారి) బి.అనిల్‌కూమార్ సౌజన్యంతో యుటిఎఫ్ జిల్లా నాయకులు జిసి.నరేష్ కుమార్ సమక్షంలో 27 మంది విద్యార్థులకు మోడల్ పేపర్లు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం మాధవీలత, యుటిఎఫ్ మండల గౌరవాధ్యక్షులు రమేష్, మండల అధ్యక్షుడు సానిపల్లి గంగాధర్, ప్రధాన కార్యదర్శి కె.మారుతి, సభ్యులు ముత్యాలు, రామాంజినేయులు, ప్రమీల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మోడల్ పేపర్లు పంపిణీ చేసిన దాత, యుటిఎఫ్ నాయకులు

కెజిబివిలో విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎపిసిదేవరాజ

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

ప్రజాశక్తి-తాడిమర్రి

ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులు క్రమశిక్షణ పట్టుదలతో ఇష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని ఏపీసి దేవరాజ్ దిశా నిర్దేశం చేశారు. గురువారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను తనిఖీ చేసిన పాఠశాలలోని పలు రికార్డులను పరిశీలించారు. మెనూ, కిచెన్, తరగతి గదులు, బాత్రూంల స్థితిగతులను పరిశీలించారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించాలని అన్నారు. అనంతరం స్టాఫ్ మీటింగ్ ఏర్పాటు చేసి పాఠశాల నిర్వహణ పై చర్చించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపల్ వాణిశ్రీ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందికి మెమోలు

ప్రజాశక్తి - గాండ్లపెంట

విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన పలువురు సచివాలయ సిబ్బందికి ఎంపిడిఒ రామకృష్ణ మెమోలు జారీ చేశారు. గురువారం గాండ్లపెంట, సోమయాజులపల్లి, వేపరాల సచివాయాల ఎంపిడిఒ రామకృష్ణ, డిప్యూటీ ఎంపిడిఒ పద్మనాభరెడ్డి గురువారం తనిఖీ చేశారు. సోమయాజులపల్లి సచివాలయంలో 9 మంది విధులకు గైరహాజరవగా కేవలం ఒక ఇంజనీరింగ్ అసిస్టెంట్ మాత్రమే విధుల్లో ఉన్నారు. దీంతో 9మందికి మెమోలు జారీ చేశారు.

పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుదాం

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడమే లక్ష్యంగా చేసుకొని ముందుకు వెళుతున్నట్లు మున్సిపల్ చైర్మన్ రమేష్ కుమార్ పేర్కొన్నారు. పురపాలక సంఘంలో ఇంటింటి చెత్త సేకరణ కోసం నూతనంగా వచ్చిన ఈ ఆటోలను జెండా ఊపి ప్రారంభించడంతోపాటు పలు ప్రాంతాలలో మునిసిపల్ కమిషనర్ మల్లికార్జునతో కలిసి చైర్మన్ ఇంటింటి చెత్త సేకరణ పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పట్టణంలో ఇంటింటి చెత్త సేకరణ కోసం గత ప్రభుత్వం చెత్త పై పన్ను వేసి పట్టణవాసులను లూటీ చేసి వారికి అనుకూలంగా ఉన్నవారికి దోచి పెట్టారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వారి ఆటలను కట్టించి, పురపాలక సంఘంపై డీజిల్ భారం పడకుండా ఎలక్ట్రిక్ ఆటోలను తీసుకురావడం జరిగిందన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి 9 ఆటోలను ప్రభుత్వం సూచించిన నిబంధనల మేరకు కొనుగోలు చేయడం జరిగిందన్నారు. ఈ ఆటోల ద్వారా ఇంటింటి చెత్త సేకరణ చేసి సేకరించిన చెత్తను నేరుగా డంప్‌యార్డుకు తరలిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులతో పాటు వార్డు ఇన్చార్జిలు, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ గౌరవనీయులైన అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టు, కదిరి
O.S.: 324/2024

Between:
1.ఎద్దుల శివారెడ్డి (Died by his Lrs No. 2 to 4)
2.ఎద్దుల ప్రసాద్‌రెడ్డి అలియాస్ ప్రసాద్
3.ఎద్దుల శ్రీకాంత్‌రెడ్డి
4.ఎద్దుల క్రిష్ణమ్మ ...వాదులు-Plaintiffs
And
ఎద్దుల లక్ష్మీనారాయణమ్మ మరియు 19 మంది ఇతరులు ...Defendants

ప్రతివాది నెం:9కు దావా సమను

To,
ఎద్దుల శోభరాణి అలియాస్ బేబి W/o శివారెడ్డి D/o లేట్ ఎద్దుల నారాయణరెడ్డి, వయస్సు 46సం॥లు హిందూ, వ్యవసాయము R/o సద్దలవాండ్లపల్లి (గ్రామం) పులగల్లు(గ్రామం), (చేలూరు హుబ్లి) చిక్కబాలాపూర్ (జిల్లా) కర్ణాటక రాష్ట్రం. **(9వ ప్రతివాది)**

పైన తెలిపిన దావాను ఎద్దుల శివారెడ్డి మరియు ముగ్గురు వాదులు భాగపరిష్కార నిమిత్తమై ఎద్దుల లక్ష్మీనారాయణమ్మ మరియు 19 మంది ప్రతివాదుల పై, పైన తెలిపిన కోర్టులో దావా వేసియున్నారు, ఈ దావాలో 9వ ప్రతివాది అయిన ఎద్దుల శోభరాణి @ బేబికు, కోర్టు నుండి సమను చేరనందున, కోర్టు వారి అదేశాను సారము 9వ ప్రతివాది అయిన నీవు 19-12-2025వ తేదీన ఉదయం 10:30 నిమిషములకు పైన తెలిపిన కోర్టు వారి ఎదుట హాజరు అయి నీ యొక్క అక్షేపణలు తెలుపుకొనవలెను అట్లు హాజరు కాని ఎడల కోర్టు వారు నీకు వ్యతిరేకముగా దావాను నిర్ణయించచుడునని తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది: 19/12/2025
స్థలం: కదిరి కోర్టు
సమయము: ఉ:10:30 ని॥లు

ఎ.క్రిష్ణమూర్తిఎమ్.ఎల్., ఎల్.ఎల్.బి, అడ్వకేట్, కదిరి, శ్రీసత్యసాయి(జిల్లా), ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం.
సెల్ నెంబర్: 9440310692, 8886389692

మహారాజశ్రీ గౌరవనీయులైన అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టు, కదిరి
I.A.No:462/2024 in O.S.No: 324/2024

Between:
1.ఎద్దుల శివారెడ్డి (Died by his Lrs No. 2 to 4)
2.ఎద్దుల ప్రసాద్‌రెడ్డి (అలియాస్ ప్రసాద్)
3.ఎద్దుల శ్రీకాంత్‌రెడ్డి
4.ఎద్దుల క్రిష్ణమ్మ ...పిటీషనర్స్-Plaintiffs
And
ఎద్దుల లక్ష్మీనారాయణమ్మ మరియు 19 మంది ఇతరులు ...Respondents-Defendants

9వ Respondentsకు దావా సమను

To,
ఎద్దుల శోభరాణి అలియాస్ బేబి W/o శివారెడ్డి D/o లేట్ ఎద్దుల నారాయణ రెడ్డి వయస్సు 46సం॥లు హిందూ, వ్యవసాయము R/o సద్దలవాండ్లపల్లి, పులగల్లు(గ్రామం) (చేలూరు హుబ్లి) చిక్కబాలాపూర్ (జిల్లా) కర్ణాటక రాష్ట్రం. **(Respondent No:9)**

పైన తెలిపిన I.A.462/2024 in O.S.324/2024 లో ఎద్దుల శివారెడ్డి మరియు ముగ్గురు పిటీషనర్స్ భాగపరిష్కార నిమిత్తమై నీపై దావా వేసియున్నారు. పైన తెల్పిన I.A.462/2024 in O.S.324/2024 ఇంజక్షన్ Order వున్నందున, నీ యొక్క హాజరు నిమిత్తము కోర్టువారు వాయిదా: 19-12-2025వ తేదీకి వేసియున్నారు. కావున నీవు పైన తెల్పిన తేదీన ఉదయము:10:30 గంటలకు పైన తెల్పిన కోర్టువారి ఎదుట హాజరు అయి నీ యొక్క అక్షేపణలు తెలుపుకొనవలెను. అట్లు హాజరు కాని ఎడల కోర్టు వారు నిన్ను ఎక్స్ పార్టిగా పరిగనించెదరు అని, తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది: 19/12/2025
స్థలం: కదిరి కోర్టు
సమయము: ఉ:10:30 ని॥లు

ఎ.క్రిష్ణమూర్తిఎమ్.ఎల్., ఎల్.ఎల్.బి, అడ్వకేట్, కదిరి, శ్రీసత్యసాయి(జిల్లా),ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం.
సెల్ నెంబర్: 9440310692, 8886389692

మహారాజశ్రీ గౌరవనీయులైన ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టు, కదిరి
E.A.No.17/2025 in E.P. No.65/2024 in O.S.No.208/2022

Between:
బి.ప్రభంజన్ రెడ్డి ...Petitioner-DHr.
And
వై.మురళి (Died) by LRs 2 to 6 ...Respondent-JDrs.

Respondent-J.Drs. 4 to 6
4. వై. శిరీష, భర్త. లేట్. వై. మురళి, వయస్సు 35 సంవత్సరములు,
5. వై. మదన్ ప్రనాయ్, తండ్రి, లేట్, వై. మురళి, వయస్సు 10 సంవత్సరములు,
6. వై. యోధన్ ప్రనాయ్, తండ్రి, లేట్. వై, మురళి, వయస్సు 8 సంవత్సరములు,
J.Dr. No.5 and 6 are minors represented by guardian her mother i.e., J.Dr. No.4 Y. Sireesha. నివాస చిరునామా ఇంటి నెం. 16-38A, తూపల్లి గ్రామం & పోస్టు, తలుపుల మండలం, శ్రీ సత్యసాయి జిల్లా.

RESPONDENTS-J.Drs. 4 to 6 వారికి కోర్టు నోటీసు
పై తెలిపిన డిక్రీ హోల్డర్ మీపై శాలరీ జప్తు కొరకు E.P. దావా కోర్టులో వేసియున్నారు. ఈ E.P దావాలో మిమ్ములను Respondents-J.Drs. 4 to 6 గా చేర్చడమైనది. మీ హాజరు నిమిత్తమై, పై కోర్టులో తేది: 07-01-2026 న వాయిదా వేసియున్నారు. కావున, పై తేదీన మీరు స్వయముగా గాని లేదా వకీలు ద్వారా గాని, పై కోర్టులో హాజరై ఏవైనా ఆక్షేపణలు ఉన్న యెడల కోర్టు వారికి తెలుపుకోవలసినదిగా ఇందుమూలముగా తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది: 07/01/2026
స్థలం: కదిరి

కె.నాగేంద్ర రెడ్డి, బి.ఎ.., బి.యల్.,
పిటిషనర్ తరపు న్యాయవాది, కదిరి

సమస్యలు పరిష్కరించలేని సమావేశాలెందుకు..?

బత్తలపల్లి ఎంపిడిఒ కార్యాలయం

ప్రజాశక్తి - బత్తలపల్లి

ప్రతి మూడు నెలలకోసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశాల్లో భాగంగా గత సమావేశాల్లో చేసిన పలు తీర్మానాలు ఆచరణలో కార్యరూపం దాల్చకపోవడంతో సమావేశాలు నిష్ప్రయోజనంగా మారుతున్నాయని పలువురు ఎంపిటిసిలు, సర్పంచులు విమర్శిస్తున్నారు. శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్న నేపథ్యంలో సమావేశాల ప్రాధాన్యతపై మండల ప్రజల్లో అధికారుల తీరుపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. గత తీర్మాణాలకే దిక్కులేకపోతే ఇక తిరిగి నిర్వహించే మండల మీట్ వల్ల ప్రయోజనం ఏమిటన్న ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటి వరకు ఐదు సమావేశాలు నిర్వహించారు. గత సమావేశాల్లో రెవెన్యూ శాఖ, వైద్యాధికారి, ఉద్యానశాఖ, రవాణాశాఖ, ఆర్అండి బి, సాంఘిక సంక్షేమ శాఖ, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ, ఐసీడీఎస్, ఇరిగేషన్, దేవాదాయ, ధర్మాదాయ శాఖ తదితర శాఖలకు సంబంధించిన అధికారులు గైర్హాజరయ్యారు. కొందరు ఉద్దేశపూర్వకంగా గైర్హాజరయితే మరికొందరు అధికార పార్టీ నేతల సూచనలతో డుమ్మా కొడుతున్నారనే విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం నిర్వహించే మండల సర్వసభ్య సమావేశానికైనా అన్ని శాఖల అధికారులు హాజరవుతారా లేదా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు ఇప్పటిదాకా చేసిన పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసిన పాపానపోలేదని కాంట్రాక్టర్లు లబోదిబోమంటున్నారు. అలాగే ఎంపీటీసీలకు ఇప్పటి వరకు గౌరవవేతనం కూడా ఇవ్వలేదు. సమావేశం జరిగిన రోజు తీర్మానం చేసి జిల్లా అధికారులకు పంపుతున్నట్లు మండల అధికారులు చెబతున్నా వాటికి ఎలాంటి సమాధానం లేకపోవడం విచారకరం.

సమస్యలివే..!

మండలంలో పలు సమస్యలు నెలకొన్నాయి. వాటిలో ప్రధానంగా కట్టకిందపల్లి గ్రామంలో ఎప్పుడో నిర్మించిన అంగన్ వాడీ కేంద్రం కూలేందుకు సిద్ధంగా ఉంది. ఇందులో తరగతులు నిర్వహించవద్దని మండల ఇంజనీర్ తెలిపినా ఇంత వరకు అక్కడ పక్కా భవనం నిర్మించలేదు. ఇక సత్యసాయి తాగునీటి పథకం నిర్వహణను ఎల్ అండ్ టి నుంచి ప్రభుత్వం తీసుకున్నా కార్మికులకు ఇప్పటి వరకు మరమ్మతులు చేసేందుకు పరికరాలను కూడా ఇవ్వలేదు. వారి వేతనాలు సక్రమంగా చెల్లించడంలేదు. అంతేకాక తండ్రి నుంచి వారసత్వంగా పొందిన కుమారుల పట్టాదారు పాసు పుస్తకాలకు పీఎం కిసాన్ డబ్బులు పడడంలేదని బాధితులు అధికారుల దృష్టికి తెచ్చినా ప్రయోజనం లేకుండా పోయింది. ఈ విషయమై అధికారులను ప్రశ్నిస్తే లాగిన్ సమస్య అంటూ తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు.ఇక ఏ సీజన్ లో పంపిణీ చేయాల్సిన విత్తనాలను ఆ సీజన్లో కాకుండా సీజన్ ముగిసిన తరువాత ఇస్తే ఏమి ప్రయోజనం ఉంటుంది. ప్రస్తుతం ఉలవలు ఇప్పుడు పంపిణీ చేస్తున్నారు. దీని వల్ల ఏమి ప్రయోజనం ఉంటుంది. సీజన్ ప్రారంభంలో ఇస్తే పంట సాగుకు అనుకూలంగా ఉంటుంది. ఇదిలా ఉండగా ఇళ్ల నిర్మాణాల్లో ఇప్పటి వరకు ప్రభుత్వం కొత్తగా ఇల్లు మంజూరు చేయలేదు. చిత్రావతి నది నుంచి ఇసుక అక్రమ రవాణా జరుగుతున్న అధికారులు పట్టించుకోవడంలేదు. రెవెన్యూ.. పోలీసు, మైన్స్ అధికారులతో చెక్‌పోస్టు ఏర్పాటు చేసినా ఇసుకను యథేచ్ఛగా తరలిస్తున్నారు. ఇప్పటికీ ఇసుక అక్రమంగా తరలుతూనే ఉంది. పంచాయతీలకు సంవత్సరంలో నాలుగు విడతలుగా నిధులు విడుదల అవుతాయి. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు ఒక్క విడత మాత్రమే నిధులు విడుదల అయ్యాయి. పంచాయతీలలో ఎస్ఆర్‌జిఎస్ ద్వారా చేపట్టిన పనులకు ఇంత వరకు బిల్లులు చెల్లించలేదు. దీంతో కాంట్రాక్టర్లు లబోదిబోమంటున్నారు. రోడ్డు మరమ్మతులకు ధర్మవరం నియోజకవర్గానికి రూ.19 కోట్లు విడుదల అయితే ఇందులో బత్తలపల్లి మండలానికి ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. అంటే బత్తలపల్లి మండలంలో రోడ్డు బాగా ఉన్నాయా అనా లేక దెబ్బతిన్న రోడ్డు కనిపించడంలేదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కదిరి-బత్తలపల్లి జాతీయ రహదారి నుంచి గరిశినపల్లి వరకు వేసిన తారురోడ్డు ఇసుక టిప్పర్లు తిరిగి రోడ్డు దారుణంగా దెబ్బతింది. వాటికి ప్యాచ్ వర్కులు చేసి చేతులు దులుపుకుంటున్నారు. రోడ్డు వేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఉప్పరపల్లి, బత్తలపల్లి నార్తు గ్రామంలో ప్రాథమిక పాఠశాలలకు ప్రహరీ లేదు. ఈ పాఠశాలలు రోడ్డుకు సమీపంలోనే ఉన్నాయి. విద్యార్థులు ఆడుకునేందుకు వచ్చినప్పుడు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది.ఇక బత్తలపల్లిలో పారిశుధ్య వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. ఇలా మండలంలో అనేక సమస్యలుంటే వాటిని అధికారుల దృష్టికి సభ్యులు మండల సర్వసభ్య సమావేశాల్లో తీసుకెళ్లినా అవి పరిష్కారం కాలేదు.

వికలాంగులకు సహకారం అభినందనీయం : ఆర్డీవో

ప్రజాశక్తి - కదిరి అర్బన్

వికలాంగులకు సహాయ సహకారాలు అందించడం అభినందనీయమని ఆర్డీవో శ్రీనివాసులు కొనియాడారు. గురువారం స్థానిక ఆర్ఎస్ రోడ్డులో లీగనుమ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఖాన్ ఆక్యుపంక్చర్ హాస్పిటల్ వారి సహకారం తో ఏర్పాటు చేసిన సేవా కార్యక్రమానికి ఆర్డీవో ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిరుపేద వికలాంగులకు వాకింగ్ స్టాండ్ లను ఉచితంగా అందచేశారు. అనంతరం హాస్పిటల్ ను సందర్శించి పేదలకు అందచేస్తున్న ఉచిత వైద్య సేవలు గురించి తెలుసుకుని డాక్టర్ ఇంతియాజ్ ఖాన్, లీగనుమ్ ఫౌండేషన్ చైర్మన్ ధర్మవరం అల్తాఫ్ బాషా సేవా స్ఫూర్తిని అభినందించారు.ఈ కార్యక్రమం లో ఖాన్ హాస్పిటల్ సిబ్బందితో పాటు లీగనుమ్ ఫౌండేషన్ ట్రస్ట్ సభ్యులు బాబూలాల్, మోహన్ బాబు, సాదిక్, మయాన, మొహమ్మద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

దీపం,ఉజ్వల పథకంతో ఉపయోగం : జేసీ

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

దీపం, ఉజ్వల యోజన గ్యాస్ పథకాలు పేద ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన గురువారం పట్టణంలో ఉన్న హెచ్.పీ గ్యాస్ డీలర్ గోవింద చౌదరికి సంబంధించిన లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పరిశీలించారు. అనంతరం వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇందులో భాగంగా రూరల్ పరిధిలోని పోతుకుంట గ్రామంలో దీపం గ్యాస్ పథకము ఉజ్వల యోజన గ్యాస్ పథకం పై నలుగురు లబ్ధిదారుల వద్ద వెళ్లి దీపం పథకం ఉజ్వల దీపం పథకం ఉపయోగాల గురించి అడిగి తెలుసుకున్నారు. గ్యాస్ కొనుగోలు చేసినప్పుడు ఎంఆర్పి ధర మాత్రమే చెల్లించాలని, అధికంగా చెల్లించకూడదని లబ్ధిదారులకి సూచించారు, అలాంటివి ఏమైనా జరుగుతున్నాయా అనిఆరా తీశారు. ఈ కార్యక్రమంలో సిఎస్‌డిటి చెన్నకేశవ నాయుడు, రెవిన్యూ అధికారులు రవిశంకర్ రెడ్డి, గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

'పురం' ఎన్జీవో సంఘం ఎన్నికలు ఏకగ్రీవం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం తాలూకా ఏపీ ఎన్జీవో సంఘం ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. గురువారం స్థానిక ఎన్జీవో కార్యాలయంలో జరిగిన ఎన్నికలకు ఏపీ ఎన్జీవో సంఘం శ్రీ సత్యసాయి జిల్లా కన్వీనర్ శంకరనారాయణ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ప్రతి పదవికి ఒక్కో నామినేషన్ మాత్రమే రావడంతో ఎన్నికలు ఏకగ్రీవంగా ముగిసినట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. గతంలో అధ్యక్షులుగా ఉన్న బి.నరసింహులు మరోసారి అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. అదేవిధంగా అసోసియేట్ అధ్యక్షులుగా జి. జగదీష్, ఉపాధ్యక్షులుగా ఎన్. శివన్న, కెఆర్. గంగాధర్, సుబ్రహ్మణ్యం, చైతన్య కుమార్, రాజేష్ , ప్రమీల, కార్యదర్శిగా కే. వేణుగోపాల్ రెడ్డి, కార్యనిర్వహణ కార్యదర్శిగా ఎస్.దాదా కళాందర్ వలి, సహాయ కార్యదర్శులుగా వెంకట్ రెడ్డి, సచివాలయం లేపాక్షి, అశ్వత్తప్ప సచివాలయం హిందూపురం మున్సిపాలిటీ,యాసీన్, సిరికల్చర్, శివరాం సచివాలయం పరిగి మండలం, మహిళా విభాగం సంయుక్త కార్యదర్శిగా భారతి హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్, కోశాధికారిగా జె. సుదర్శన్ బాబు ఎన్నికయ్యారు. ఎన్నికైన కొత్త కార్యవర్గ సభ్యులను ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జే. మాధవ, శ్రీ సత్యసాయి జిల్లా చైర్మన్ లింగ రామ్మోహన్ శుభాకాంక్షలు తెలియజేశారు.

నూతనంగా ఎంపికైన కార్యవర్గం

వైఎస్.సునీత పోరాటానికి మద్దతు : కందికుంట

ప్రజాశక్తి - కదిరి టౌన్

మాట్లాడుతున్న కందికుంట

వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో నిందితులను అరెస్ట్ చేయాలని ఆయన కుమార్తె సునీత పోరాటానికి మద్దతు పలుకుతున్నామని ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం పట్టణంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ కేసులో కీలక నిందితులను అరెస్ట్ న్యాయం చేయాలని వివేకానందరెడ్డి కుమార్తె సునీత పోరాటం చేస్తోందని ఆమె పట్టదలకు మనస్ఫూర్తిగా తమ మద్దతు ప్రకటిస్తున్నానని చెప్పారు. వైఎస్ సునీతకు మద్దతుగా కదిరి నియోజకవర్గంలో ర్యాలీలు, సంతకాలు, కొవ్వొత్తుల ర్యాలీలు చేపడతామన్నారు. సొంత చెల్లికి న్యాయం చేయాలని సంతకాలు సేకరించి జగన్‌కు పంపుతామన్నారు. వైఎస్ జగన్ తలపెట్టిన కోటి సంతకాలన్నీ కూడా ఫోర్జరీ సంతకాలని విమర్శించారు.

పుర ప్రజల సౌకర్యార్థం ప్రత్యేక సహాయ కేంద్రం

ప్రజాశక్తి-హిందూపురం

వివరాలను వెల్లడిస్తున్న మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున

రాష్ట్ర ప్రభుత్వం పురపాలక సంఘ వ్యాప్తంగా అనధికార నిర్మాణాలు, లేఅవుట్లను సక్రమం చేసుకోవడానికి బిల్డింగ్ పీనలైజేషన్ స్కీం (బి పి ఎస్), లేఅవుట్ రెగ్యులేషన్స్ స్కీం (ఎల్ ఆర్ ఎస్) ఫిర్యాదులు సందేహాలు దరఖాస్తులకు సంబంధించి ప్రత్యేక సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున పేర్కొన్నారు. ఈ విషయంపై గురువారం ఆయన మాట్లాడుతూ, పురపాలక సంఘంలో అక్రమ కట్టడాలతో పాటు అక్రమ లే అవుట్లను సక్రమం చేసుకోవడానికి ప్రత్యేక పథకాన్ని తీసుకురావడం జరిగిందన్నారు. అక్రమ నిర్మాణాలు చేసుకున్న ప్రతి ఒక్కరూ దీనిని సద్వినియోగం చేసుకొని సక్రమం చేసుకోవాలన్నారు.

మహారాజశ్రీ గౌరవనీయులైన ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టు, కదిరి
O.S.No.131/2024

Between:
తాటిపిగారి జగన్ మోహన్ ...వాది
And
శ్రీమతి తాటిపి గారి రమణమ్మ మరియు ఇతరులు ...ప్రతివాదులు

2,4 ప్రతివాదులకు నోటీసు
పై దావాలో 2,4వ ప్రతివాది అయిన 1) తాటిపి గారి విజయకుమార్, S/o Late శివకేశవులు, కూటాగుళ్ళ(గా), కదిరి (మం), శ్రీ సత్యసాయి జిల్లా.
2వ ప్రతివాది. 2) తాటిపి గారి గిరిధర్ S/o లేట్ శివకేశవులు, కూటాగుళ్ళ (గా), కదిరి (మం), శ్రీసత్యసాయి జిల్లా, (4వ ప్రతివాది), అయిన మీకు తెలియజేయడమేమనగా పై దావాలో మీ హాజరు నిమిత్తం పై కోర్టు వారు తేదీ 30/12/2025వ తేదీన వాయిదా వేసియున్నారు. కావున సదరు తేదీనాడు మీరు స్వయంగా గానీ, వకీలు ద్వారా గానీ హాజరై ఎటువంటి అక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనగలరు. అట్లు హాజరు కాని యెడల పై కోర్టు వారు మీ ఇరువురుని పరోక్షంగా తీర్మాణించెదురు అని తెలియ జేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది: 30/12/2025
స్థలం: కదిరి

తూమకుంట బాబాజాన్, ఎమ్.ఎ., ఎల్.ఎల్.బి,
వాది తరపున వకీలు, కదిరి

In the court of the Additional Junior Civil Judge, Penukonda
E.P.No. 29/2025 in O.S.No 140/2020

Between:
G.Anjina Reddy ...Petitioner-DHr
And
B.Prakash ...Respondent-JDr

పై నెంబరు E.Pలోని ప్రతివాదికి Order 21 rule 54 నోటీసు

To,
B.Prakash, S/o Suryanarayana, Door No-02-519, Maruthi Nagar, Somandepalli Village and Mandal, Sri Sathya Sai (Dist), A.P (State).
ఇందుమూలముగా నీకు తెలియచేయడమేమనగా పై నెంబరు E.P. లోని అర్జీదారుడునే నుండి E.P మొత్తము రాబట్టుకొనుటకు గాను E.P షెడ్యూలు దాఖలా అస్తులు జప్తికి గాను పై E.Pను దాఖలు చేసినారు సదరి విషయములై నీకు ఏమైనా అక్షేపనలు వున్న ఎడల నీవు 18-12-2025వ తేదీన ఉదయం 10:30 గంటలకు ఖుద్దున గానీ వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై నీ వాదనను కోర్టు వారికి తెలుపుకొనవలెయును. లేని ఎడల నీ పరోక్షమందు తీర్మానము చేయుదరని ఇందుమూలముగా నీకు తెలియజేయడమైనది.

(By order of the court)

ఇట్లు
సి.ఆర్.నాగార్జున
అర్జీదారు పరం వకీలు, పెనుకొండ

ఆలయంలో చోరీపై విచారణ కమిటీ

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి రూరల్ మండలం లోని ఎర్రదొడ్డి గంగమ్మ ఆలయంలో ఈనెల 7న జరిగిన చోరీ ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినట్లు డిప్యూటీ కమిషనర్ గురు ప్రసాద్ తెలిపారు. ఈ ఘటనలో లోతైన సమాచారం కోసం గతంలో పనిచేసిన ఈవో ఇతర సిబ్బందిని విచారించడంతో పాటు ఆలయానికి సంబంధించిన నగలు, చీరలు,పలు రికార్డులు పరిశీలించామన్నారు. గంగమ్మ ఆలయంలో నగలు చీరలు చోరీకి యత్నించిన ఈవో మురళీకృష్ణ తో పాటు, ఆయన భార్యపై కూడా విచారణ చేస్తున్నామని చెప్పారు. సీసీ ఫుటేజ్ ఆధారంగా ఈవో మురళీకృష్ణ ను పోలీసులు అరెస్ట్ చేశారని, దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు ఆయనను విధులనుండి సస్పెండ్ చేశారని తెలిపారు. ఈవో వ్యవహారం అవకతవకల పై సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

విద్యార్థులకు స్క్రబ్ టైఫస్‌పై అవగాహన

ప్రజాశక్తి - కదిరి అర్బన్

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పట్నం వైద్యాధికారి వినోద్ కుమార్, సబ్ యూనిట్ అధికారి దేవలా నాయక్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని కుమ్మరవాండ్లపల్లి స్పేస్ జూనియర్ కాలేజ్ విద్యార్థులకు స్క్రబ్ టైపస్ వ్యాధి గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రికెట్ సియాసి అనే బ్యాక్టీరియా వల్ల ఈ వ్యాధి సోకుతుందన్నారు. పిడుదులు, చిడుములు యందు ఈ బాక్టీరియా ఉంటుందన్నారు.ఈ కీటకములు కుట్టడం వల్ల ఈ వ్యాధి వస్తుందని విద్యార్థులకు వివరించారు. కుట్టిన పది రోజులకు ఈ వ్యాధి సోకుతుందన్నారు. ఈ వ్యాధి ఎలుకలు తిరుగు ప్రదేశంలో వ్యవసాయాధారిత గడ్డి, పిచ్చి మొక్కల్లో ఈ క్రిముల లార్వా ఉంటుందన్నారు. వ్యాధిని త్వరితగతన గుర్తించడం వలన నియంత్రణ,నివారణ సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి వినోద్ కుమార్, సిహెచ్ఒ లక్ష్మీదేవమ్మ, దేవలా నాయక్, సూపర్వైజర్లు విజయ శేఖర్ రావు, శశిధర్, పద్మజ, పురుష ఆరోగ్య సహాయకులు ప్రభాకర్ రెడ్డి, మున్నా, సురేంద్రనాయక్, ఆరోగ్య కార్యదర్శులు శివమ్మ, జయశ్రీ,,కళాశాల ప్రిన్సిపల్ మధు, ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

'శక్తి' యాప్‌తో మహిళల భద్రత

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

జిల్లాలో మహిళలు ,బాలికల భద్రతే ముఖ్యమని ప్రతి ఒక్కరు శక్తి యాప్ డౌన్లోడ్ చేసుకోవాలని శక్తి టీం బృందాలు సూచించాయి. గురువారం జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాల, కళాశాలల్లోని విద్యార్థులకు 'శక్తి' యాప్ వినియోగంపై అవగాహన కల్పించారు. 'శక్తి' యాప్ మహిళలు, బాలికల ఆపద సమయంలో ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, 'శక్తి' టీమ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అధైర్య పడొద్దు అండగా ఉంటాం

ప్రజాశక్తి-హిందూపురం

తల్లి తండ్రి లేరని అధైర్య పడకూడదని పాత్రికేయులందరూ అండగా ఉంటామని అనాథలైన అమ్మాయిలకు హిందూపురం పాత్రికేయులు భరోసా ఇచ్చారు. శ్రీ సత్య సాయి జిల్లా పరిగి మండల కేంద్రంలోని వైఎస్ఆర్ కాలనీలో నివాసముంటున్న భజంత్రీ గోపాల్ ఇటీవల మృతి చెందాడు. ఎనిమిది సంవత్సరాల క్రితం ఇతని భార్య సైతం మృతిచెందింది. తల్లిదండ్రులు ఇద్దరు ఒకరి తరువాత ఒకరు మృతి చెందడంతో వారిద్దరికీ ఉన్న ఇద్దరు ఆడబిడ్డలు అనాథలయ్యారు. ఇందులో పెద్ద కూతురు అక్షిత పట్టణంలోని సువర్ణ భారతి జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం బైపిసి చదువుతోంది. ప్రథమ సంవత్సరంలో 440 మార్కులకు గాను 436 సాధించింది. చదువులో రాణిస్తున్న ఆ అమ్మాయిలను ఆదుకోవడంతో పాటు వారికి అండగా నిలవాలని హిందూపురం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో 46 మంది పాత్రికేయులు రూ. 61 వేలు నగదును ఆడబిడ్డల ఉన్నత చదువుల కోసం గురువారం వారి ఇంటికి వెళ్లి అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు రామాంజనేయులు, ప్రశాంత్, సీనియర్ పాత్రికేయులు రమేష్, షబ్బీర్, గంగప్ప, ఆంజనేయులు, రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

మాతాశిశు మరణాలను నివారిద్దాం

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ఏ తల్లీ బిడ్డకు జన్మనిస్తూ మృతిచెందరాదని జన్మించిన ఏ శిశువూ మృతిచెందరాదని డిఎంహెచ్ఒ డాక్టర్ పై రోజా బేగం పేర్కొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో గురువారం మాతా శిశు మరణాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమము లో జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ మధుసూదన్, డిపిఎంఒ డాక్టర్ నాగేంద్ర నాయక్, జిల్లా వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమ నిర్వహణ అధికారి డాక్టర్ కే సురేష్ బాబు, పుట్టపర్తి ఉపాధి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సునీల్ కుమార్, డిపిహెచ్ ఎన్ఒ వీరమ్మ ,చిన్న పిల్లల వైద్యులు సాయికుమార్, ప్రసూతి వైద్య నిపుణులు అస్రున్నిసా పాల్గొన్నారు. ఇటీవల జరిగిన ఒక మాతృ మరణం, 13 శిశు మరణాల పై అధికారులు సమీక్షించారు. అవసరమైన చర్యలు చేపట్టి మాతృ మరణాన్ని నివారించి ఉండవచ్చునని సంబంధిత వైద్యాధికారి పర్యవేక్షకులు ఆరోగ్య కార్యకర్తలు ఆశా అంగన్వాడి కార్యకర్తలకు కమిటీ సూచించింది. భవిష్యత్తులో సత్య సాయి జిల్లాలో ఒక మాతృ మరణం కూడా సంభవించకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని వైద్యాధికారులకు, సిబ్బందికి సూచించారు . అనంతరం 13 మంది పురిటి పిల్లల మరణాలపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా చిన్న పిల్లల వైద్యులు మాట్లాడుతూ గర్భిణులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పరీక్షలకే వచ్చినపుడు ఆరోగ్య విద్య తప్పనిసరిగా బోధించాలని అందులో భాగంగా ప్రసవానంతరం తల్లి బిడ్డకు పాలిచ్చే పద్ధతిని తెలియజేయాలని సూచించారు. ప్రతి ఆరోగ్య కార్యకర్త, అంగన్వాడీ ఆశ, కార్యకర్త ఇంటింటికి వెళ్లి మధుమేహం, అధిక రక్తపోటు తదితర జబ్బుల పట్ల తప్పనిసరిగా అవగాహన కల్పించాలన్నారు.

మైనార్టీల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

సమావేశంలో మాట్లాడుతున్న పల్లె రఘునాథరెడ్డి

ప్రజాశక్తి - కొత్తచెరువు

మైనార్టీల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పేర్కొన్నారు. కొత్త చెరువులోని హజరత్ మస్తాన్ వలి దర్గాలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పల్లె మాట్లాడుతూ దర్గా కమిటీ నుండి పేద ముస్లిం మహిళలకు, ఒంటరి మహిళలకు, వితంతువులకు, నిత్యవసర సరుకులను అందజేయడం అభినందనీయమన్నారు. ఈ దర్గాకు ఆదాయం బాగా ఉన్నందున మరిన్ని అభివృద్ధి పనులను చేపట్టాలని సూచించారు. షాదీ ఖానా పనులను త్వరగా పూర్తిచేస్తే పేద ప్రజల పెళ్లిళ్ల చేసుకోవడానికి ఇది ఎంతో ఉపయోగపడుతుందన్నారు. వీటి మరమ్మతులకు ప్రభుత్వం నుండి నిధులను మంజూరు చేయిస్తానన్నారు. ధర్మవరం రోడ్డు పుట్టపర్తి రోడ్డు ప్రధాన రహదారికి ఇరువైపులా సత్యసాయి పైప్ లైన్లు ఉన్నందున వాటిని త్వరలో మార్చి నూతన రోడ్డును వేయించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో దర్గా కమిటీ మేనేజర్ మాణిక్యం బాబా, టిడిపి నాయకులు ఎస్ శ్రీనివాసులు, టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, మార్కెట్ యార్డ్ చైర్మన్ పూల శివప్రసాద్, నాయకులు సైకిల్ షాప్ బాబా, అస్లాం, ఇమామ్,తదితరులు పాల్గొన్నారు.

బాలయ్య ఇంటి ముట్టడితో జిల్లా సాధన ఉద్యమాన్ని ప్రారంభిస్తాం

జిల్లాకేంద్రం సాధన సమితి నాయకులు

బాలయ్య వీడియో సందేశాన్ని చూపిస్తున్న ఇందాద్

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం జిల్లా సాధన కోసం చేపట్టే ఆందోళన కార్యక్రమాలను స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఇంటి ముట్టడితోనే ప్రారంభిస్తామని హిందూపురం జిల్లా సాధన సమితి నాయకులు పేర్కొన్నారు. హిందూపురం జిల్లా సాధన కోసం ప్రత్యేక కమిటీని ఎంపిక చేసుకున్నట్లు వివరించారు. గురువారం పట్టణంలోని ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి దీనికి సంబంధించిన వివరాలు వెల్లడించారు. జిల్లా సాధన సమితి అధ్యక్షులు న్యాయవాది ఇందాద్, ప్రధాన కార్యదర్శి శ్రీరాములు, నాయకులు మాట్లాడుతూ, హిందూపురం నియోజకవర్గం అంటేనే రాష్ట్రంలో గుర్తొచ్చేది నందమూరి వంశం అన్నారు. తెలుగుదేశం పార్టీ ప్రారంభం నుండి ఇప్పటివరకు ఓటమి ఎరుగని కోట ఏదైనా ఉంది అంటే అది హిందూపురం అన్నారు. 40 సంవత్సరాలపాటు తెలుగుదేశం పార్టీకి అండగా నిలిచిన హిందూపురం ప్రాంతానికి పార్టీ చేసింది ఏమీ లేదన్నారు. ఈ ప్రాంత ప్రజల రుణం తీర్చుకోవాలంటే బాలకృష్ణ హిందూపురానికి జిల్లా కేంద్రాన్ని తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో జిల్లాల పునర్విభజన కోసం ఏర్పాటుచేసిన సబ్ కమిటీకి హిందూపురం కేంద్రంగా జిల్లా ప్రకటించాలని కనీసం కోరలేదన్నారు. వేసిన కమిటీలు సైతం హిందూపురం పట్టణంలో పర్యటించిన పాపాన పోలేదన్నారు. ఎక్కడో ఏసీ రూముల్లో కూర్చుని జిల్లాల పునర్విభజనను చేపట్టారని ఆరోపించారు. ఏడు రోజుల్లో బాలకృష్ణ జిల్లాకు సంబంధించి ఏదో ఒక ప్రకటన చేయాలన్నారు. లేనిపక్షంలో జిల్లా సాధన కోసం చేపట్టే దశలవారీ ఉద్యమాలను బాలకృష్ణ ఇంటి ముట్టడితోనే ప్రారంభిస్తామన్నారు. అప్పటికీ ప్రభుత్వం జిల్లా కేంద్రంగా హిందూపురాన్ని ప్రకటించకపోతే ఆమరణ నిరాహార దీక్షలకు సైతం సిద్ధమవుతామన్నారు. జిల్లా సాధన కోసం చేపట్టబోయే ఆందోళన కార్యక్రమాల్లో పార్టీలకు అతీతంగా స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ తో పాటు కూటమి నాయకుల సైతం పాల్గొనాలని జిల్లా సాధన సమితి నాయకులు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా సాధన సమితి నాయకులు కొల్లగుంట నాగరాజు, బాబావలి, అమానుల్లా, రవికుమార్, కదిరిష్, శంకరయ్య, నూర్ మొహమ్మద్, రమణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సాధన సమితి కార్యవర్గం ఏర్పాటు

హిందూపురం జిల్లా సాధన సమితి నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేసుకున్నట్లు అధ్యక్షులు ఇందాద్ పేర్కొన్నారు. తనతోపాటు గౌరవ అధ్యక్షులుగా బాలాజీ మనోహర్, గౌరవ సలహాదారులుగా న్యాయవాది రామచంద్రారెడ్డి, ప్రముఖ చిన్న పిల్లల వైద్యులు వెంకటరమణ, టిప్పు సుల్తాన్ రిలేటెడ్ ఫ్రంట్ అధ్యక్షులు ఉమర్ ఫారూఖ్ ఖాన్, ప్రధాన కార్యదర్శిగా శ్రీరాములు, ఉపాధ్యక్షులుగా కొల్లకుంట నాగరాజు, బాబావలి, అధికార ప్రతినిధులుగా అమానుల్లా, దాదాపీర్, వినోద్ కుమార్, ప్రచార కార్యదర్శిగా షేక్ జమీల్, కార్య నిర్వాహక కార్యదర్శులుగా రవికుమార్, కదిరిష్, చంద్రశేఖర్ రెడ్డి తో పాటు కార్యదర్శులు, సహాయ కార్యదర్సులు తో పాటు ఎగ్జిక్యూటివ్ మెంబర్లను ఎంపిక చేసినట్లు ఇందాద్ వివరించారు.